పిల్లల్ని ప్రతిభావంతులుగా పెంచడమెలా?

సి.నరసింహారావు

పిల్లల సర్వతోముఖ వికాసానికి తోడ్పడే రీతిలో, తల్లితండ్రులు తమ ప్రేమానురాగాలను సృజనాత్మకంగా, శక్తివంతంగా ఎలా వెల్లడించాలో, పిల్లల మనోభావాలను ప్రయోజనకరమైన రీతిలో ఎలా ప్రభావితం చేయాలో, పిల్లలు చదువులో, పరీక్షలలో బాగా రాణించడానికి ఎలా తోడ్పడాలో, తాము ఆశించిన రీతిలో పిల్లలను ఉన్నతంగా ఎలా తీర్చిదిద్దాలో సాధికారికంగా వివరించే అత్యంత ప్రయోజనకర గ్రంధం.

Pillalanu Pratibhavantuluga Penchadamela ?

(How to rise brighter children)

Challagulla Narasimha Rao

Price :**One Hundred Fifty Rupees**

First Edition: **May, 2008**

Publishers :

Nani International,

408, Vijaya Towers, Shantinagar, **Hyderabad - 500 028**

Phones : 66665146, 98661 81388

Website: www.narasimharao.com

Printed at :

Anupama Printers, 126,Shanti Nagar, **Hyderabad-500 028**

Copies available at all Branches of

Visalandhra Book House.

ముందుకు, ముమ్ముందుకు...

పసితనం నుండి ప్రపంచంలోకి 6

చిన్నారులు ...11

01. తొలిసారిగా మాతృత్వంపొందేవారి ఆలోచనలు ఎలా సాగుతుంటాయి? ... 12
02. అనేక విషయాలు నేర్పడం మాని అనుక్షణం శాసించవద్దు. ... 17
03. పిల్లల్నిపెంచే సమయంలో తల్లితండ్రులు వారితో ఎలా ప్రవర్తించాలి? ... 24
04. చిన్న పిల్లల ప్రవర్తనను తల్లితండ్రులెలా తీర్చిదిద్దాలి? ... 27
05. మీ చిన్నారి పాపలక మంచి అలవాట్లు నేర్పడం ఎలా ... 30
06. పిల్లలకు మాటలు నేర్పడం ఎలా? ... 35
07. మీ ప్రేమనురాగాలను మీ పిల్లల దగ్గర సరిగ్గా వ్యక్తంచేస్తున్నారా? ... 42
08. చిన్న పిల్లలను ఎప్పుడు ఎలా అభినందించాలి? ... 45
09. చిన్నారి పాపలు ఎందుకు అల్లరిచేస్తారు? ... 50
10. తల్లితండ్రులు తమ పిల్లలకు సరైన క్రమశిక్షణను నిర్దేశించడమెలా? ... 53
11. తల్లితండ్రులు తమ పిల్లల మేధాశక్తిని పెంపొందించడమెలా? ... 57
12. పిల్లల మనోవికాసానికి దోహదంచేసే తల్లితండ్రుల ప్రవర్తన ఎలావుండాలి?... 64
13. తల్లి తండ్రులు విద్యావంతులైతే పిల్లలకు ప్రయోజనకరమా? ... 92
14. పిల్లలపై తల్లితండ్రుల ప్రభావం ఎలా ప్రసరిస్తుంది? ... 95
15. తల్లితండ్రులు తమ పిల్లలతో ఎలా ప్రవర్తించాలి? ...100

యువతరం ...106

16. ఆధునిక యువతులు పిల్లలకు వివిధ విషయాలెలా నేర్పుతారు? ...107
17. ఆధునిక యువతులు తమపిల్లలలో అభద్రతాభావన కలగడానికెలాత్రోవతీస్తారు? ...110
18. యువతీ యువకులతో తల్లితండ్రులెలా ప్రవర్తించాలి? ...113
19. ఎదిగిన పిల్లలతో తల్లితండ్రులెలా వ్యవహరించాలి? ...119
20. ఎదిరించే యువతీ యువకులతో ఎలా ప్రవర్తించాలి? ...122
21. "మేమేం చిన్నపిల్లలంకాము. ఎలావుండాలో మాకుతెలుసు" ...131
22. యువతీ యువకుల అభిప్రాయాలను, అభిరుచులు తృణీకరించవద్దు! ...133
23. యువతీ యువకులు తల్లితండ్రులతో ఎందుకు విభేదిస్తారు? ...136
24. యువకులు పరిస్థితుల్ని సవ్యంగా ఎందుకు అర్థంచేసుకోలేరు? ...139

25. విద్యావ్యాసంగం ఆధునిక యువతులపై ఏ ప్రభావం కలిగిస్తుంది? ...142
26. యువతరపు తిరుగుబాటుకు కారణాలేమిటి? ...145
27. యువతీ యువకులు విమర్శలను ఎందుకు సహించలేరు? ...148
28. తోటి సమాజంపట్ల యువతీ యువకుల దృక్పధమెలావుంటుంది? ...151
29. యువతీ యువకులు స్నేహానికి ఎటువంటి ప్రాధాన్యతనిస్తారు? ...154
30. యువతీ యువకులు స్నేహానికి అత్యంత ప్రాధాన్యత ఎందుకిస్తారు? ...157
31. వివాహం పట్ల యువతీ యువకుల దృక్పధమెలావుంటుంది? ...160
32. యువతీ యువకులు తమలోని లోపాలనెలా సవరించుకోజూస్తారు? ...163
33. యువతీ యువకులు దౌర్జన్యంగా, దురుసుగా ఎందుకు ప్రవర్తిస్తారు? ...166
34. కొందరు యువతీ యువకులు తోటివారితో ఎందుకు కలసిమెలసి వుండలేరు? ...169
35. ఆధునిక యువతులు తల్లితండ్రులతో ఎందుకు విభేదిస్తారు? ...172
36. ఏమీ తోచకపోవడానికి, విసుగ్గా వుండడానికి కారణాలేమిటి? ...174
37. మీకు, మీ కుటుంబ సభ్యులకు మధ్య చెలరేగే కలహాలను అతితేలిగ్గా నివారించవచ్చు? ...177

విద్యార్థులు, పరీక్షలు ...184

38. విద్యార్థులు చదువుకోవడానికి ఏయే అటంకాలు ఏర్పడుతుంటాయి? ...185
39. విద్యార్థులు పరీక్షలు తప్పడానికి దోహదం చేసే అంశాలేమిటి? ...192
40. ప్రధమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని నిర్ణయించుకోండి. చాలు! ...197
41. ప్రధమ శ్రేణిలో ఉత్తీర్ణులవుతారా? లేక పరీక్షల్లో తప్పుతారా? ...202
42. విద్యార్థులు తాము చదివినవి ఎందుకు మరచిపోతారు? జ్ఞాపకం వుంచుకోవడమెలా? ...205
43. విద్యార్థులు పరీక్షలు తప్పడానికి కారణమేమిటి? వాటిని సరిచేసుకోవడమెలా? ...213
44. విద్యార్థులు పరీక్షలను ఎదుర్కొనడమెలా? ...222
45. వైఫల్యాన్ని చూసి భయపడవద్దు! ...229
46. పరీక్షలు వచ్చేస్తున్నాయని కంగారుపడవద్దు! ...232
47. విద్యార్థులు తమ చదువుపట్ల ఆసక్తి పెంపొందించుకోవడమెలా? ...235
48. ప్రధమ శ్రేణిలో లేకపోతే....! ...238

ప్రధాన పరిశీలిత గ్రంధాలు ..240

పసితనం నుండి ప్రపంచంలోకి...

ప్రపంచంలోని తల్లితండ్రులందరూ తమ పిల్లలకు ఉన్నతభవిష్యత్తు లభించాలని కోరుకొంటుంటారు. తమ పిల్లలు అసాధారణ శక్తి సామర్థ్యాలు సంతరించుకోవాలని, పేరుప్రఖ్యాతులు సంపాదించాలని, అన్నిరంగాలలో అగ్రగణ్యులుగా నిలవాలని అభిలషిస్తారు. అందుకోసం తాము శాయశక్తులా పాటు పడతామని చెబుతారు. వారు నిరంతరం ఈ అంశాలనే తమ పిల్లలకు ఉద్బోధిస్తుంటారు. పిల్లల ఎదుగుదలపై తల్లితండ్రుల ప్రభావం అధికంగా వుంటుందని మనో వైజ్ఞానికులందరూ అంగీకరిస్తున్నారు.

పిల్లలపై అధికతరప్రభావం చూపేవి తల్లితండ్రుల ప్రియవచనాలుకాదు. తల్లితండ్రుల ప్రవర్తనను అతినిశితంగా గమనిస్తూ, పిల్లలు ఎప్పటికప్పుడు తమ ప్రవర్తనను తీర్చిదిద్దుకొంటారు. అందుకే తల్లితండ్రులు చెప్పేవాటికి, వారి ప్రవర్తనకు మధ్య అంతరం వుండకూడదు. ఎక్కువగా ఖర్చుచేయగూడదని, పొదుపుగా వుండడం నేర్చుకోవాలని చెబుతూ, తల్లితండ్రులు విచ్చలవిడిగా, విలాసంగా ఖర్చుచేస్తుంటే, అలాగే దురలవాట్లకు దూరంగా వుండాలని పిల్లలను హెచ్చరించుతూ తామే దురలవాట్లకు అలవాటుపడితే పిల్లలు ఏం నేర్చుకొంటారు? తల్లితండ్రులు చెప్పేమాటలకు విలువ ఇవ్వనవసరం లేదని పిల్లలు గ్రహిస్తారు. పైగా తాముచేసే పనులకు విరుద్ధమైన మాటలు చెప్పడం, ఆదేకోవలో అబద్ధాలు చెప్పడం ఒక సహజ ప్రక్రియగా వారు పొరబడతారు. అందుకే పిల్లలకు ఉన్నత భవిష్యత్తు కల్పించాలని ఆశించే తల్లితండ్రులు ముమ్మందుగా తాము ఉన్నత తరహా ప్రవర్తనను అలవరచు కోవాలి. తమ ఆచరణకు, తాముచెప్పేవాటికి ఎక్కడా వైరుధ్యంలేకుండా జాగ్రత్తపడాలి. తమ ప్రవర్తనలో, మాటల్లో ఎక్కడా ప్రతికూల లక్షణాలు కన్పించకుండా జాగ్రత్తపడాలి. ఎవరినైనా చులకనగా మాట్లాడడం, హేళనచేయడం, వ్యంగ్యంగా వ్యాఖ్యానించడం వంటివాటికి పూర్తిగా దూరంగా వుండాలి. అలాగే ఆందోళనకు, ఉద్రిక్తతకు, అభద్రతాభావానికి లోనుకావడం అలవాటుగామారితే, ముమ్మందుగా ఈ ప్రతికూల ప్రవర్తనను సరిచేసుకోవాలి. తమ ప్రవర్తన నిరంతరం ఒకేలా, స్థిరంగా, ఆహ్లాదకరంగా వుండేట్లు జాగ్రత్తపడాలి. తమ జీవితంలో ఉన్నత విలువలు నింపుకున్నవారు, ఏమీచెప్పకుండా నిశ్శబ్దంగా మిగిలిపోయినా, పిల్లలు వారంతటవారే ఉన్నత విలువలను, అందుకనుగుణంగా ఉన్నతజీవితాన్ని అందిపుచ్చుకోకల్గుతారు.

మనందరం మనలో కలిగే ఉద్రేకాలను, ఉద్వేగాలను, ఆవేశాలను ఏ క్షణానికాక్షణం వ్యక్తంచేయకుండా ఎప్పటికప్పుడు నిగ్రహాన్ని పాటిస్తుంటాము. మదిలో చెలరేగే ఉద్వేగాలకనుగుణంగా ప్రవర్తించకుండా మనల్ని మనం కట్టడి చేసుకొంటాము. ఇటువంటి సంస్కారయుతమైన ప్రవర్తనను చాలమంది తమ ఇంట్లో పాటించరు. భార్యా భర్తలకు ఒకరిపై ఒకరికి ఆగ్రహం కలిగితే దానిని తక్షణమే వ్యక్తం చేస్తారు. అలాగే పిల్లల చేష్టలు తమకెంతో ఆనందాన్ని, పారవశ్యాన్ని కలిగించితే ఆయాభావనలను తక్షణమే తమ ప్రవర్తనద్వారా వ్యక్తం చేస్తారు. ఇలా ప్రేమానురాగాలను వ్యక్తంచేయడానికి అలవాటుపడిన తరువాత తమ నిరాశా, నిస్పృహలను, ఆగ్రహాన్ని, ఆందోళనను కూడా పిల్లలపై అప్పటికప్పుడు ప్రదర్శించబోతారు. తాము సహజంగా, తమకు తోచినరీతిలో ప్రవర్తించుతున్నప్పుడు ఒక్కోసారి తల్లితండ్రులు ప్రేమానురాగాలు ఎందుకు కురిపిస్తారో, మరోసారి ఆగ్రహావేశాలు ఎందుకు కనపరచుతారో పిల్లలు అవగతంచేసుకోలేరు. అందుకే తల్లితండ్రులు తమ ప్రేమానురాగాలనుకాని, తమ ఆవేశకావేశాలనుగాని యధాతథంగా వ్యక్తం చేయకుండా పిల్లలవద్ద తమ మనోభావాలను ప్రయోజనకరంగా ఎలా వ్యక్తంచేయాలో ముమ్మందుగా గుర్తించాలి. పిల్లల ఎదుగుదలకు తోడ్పడుతుందని గుర్తించి కోడిగ్రుడ్డును, ఆపిల్‌కాయను, అరటిపండును ఎంతటి గోముగా తినిపిస్తారో, అదేకోవలో పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని, చొరవను, ప్రేమానురాగాలను పెంపొందించేలా, వారు మంచీ చెడుల విచక్షణను గుర్తించేలా తమ మనోభావాలను వ్యక్తంచేయాలి.

మాటలను అర్థంచేసుకొనే వయస్సు వచ్చిన పిల్లలదగ్గర, తమ సమవయస్కులతో ప్రవర్తించే తీరులోనే ప్రవర్తించాలి. వారు చెప్పేది వినిపించుకోకపోవడం, వారిని నిర్లక్ష్యంగా చూడటం ఏ మాత్రం తగవు. తోటివారితో వ్యవహరించే తరహాలోనే పిల్లలతో కూడా వ్యవహరించకలిగినప్పుడు, వారికి తమను తాము ఈ ప్రపంచపోకడలకు, తోటి సమాజానికి అన్వయించుకోవడం సులభతరమవుతుంది. ఈ సమాజంలో తమ పాత్ర ఏమిటో చిన్నపిల్లలు నిర్వచించుకోవడానికి అది తోడ్పడుతుంది.

తోటి వ్యక్తులతో ఎలా వ్యవహరించాలో, ఎదుటివారి ప్రవర్తనకు అనుగుణంగా ఎలా ప్రతిస్పందించాలో అందరికీ తెలుసు. అదేకోవలో తల్లితండ్రులు, ఇతరులుకూడా చిన్న పిల్లలతో ప్రవర్తించబోతారు. చిన్నపిల్లలతో తాముభిన్నంగా ప్రవర్తించాలని వారు గుర్తించరు ఒక అయిదేళ్ళ పాప తన

తమ్ముడిని అనవసరంగా కొట్టగానే తల్లితండ్రులు అలా కొట్టడం గురించే పట్టించుకొంటారు. అలాకొట్టడం తప్పని చెప్పబోతారు. అంతే తప్ప అలాకొట్టడం వెనుక, పాపమనోభావాలేమిటి, వాటిని ఎలా సరిదిద్దాలని వారు ఆలోచించరు. ఇందుకు భిన్నంగా, రకరకాల ప్రవర్తనలద్వారా పిల్లలు వెల్లడించే మనోభావాలను తల్లితండ్రులు ఎప్పటికప్పుడు గుర్తించడం అలవాటుచేసుకోవాలి. ఆ మనోభావాలు గుర్తించకుండా కేవలం వారి ప్రవర్తనను సరిదిద్దాలనుకోవడం ద్వారా ఎటువంటి ప్రయోజనం వుండదు.

చిన్నపిల్లలకు చుట్టూవున్న వ్యక్తులను, వారి ప్రవర్తనను, పరిసరాలను అవగతంచేసుకొనే, అలాగే ఎదిగే వయస్సులో వివిధ అంశాలను నేర్చుకొనే కుతూహలం, ఆసక్తి సహజంగా వుంటాయి. చిన్నపిల్లల్లో వుండే సహజమైన కుతూహలాన్ని ఆసరాగాతీసుకొని, వారు వివిధ విషయాలను అవగతం చేసుకోవడానికి తల్లితండ్రులు నిరంతరం తోడ్పడాలి. వారికుతూహలాన్ని దెబ్బతీసేవిధంగా, తామే అన్నివిషయాలు వారికి ఒకేసారి నేర్పాలన్న ఆత్రుత కనపరచగూడదు. వారిలో వివిధ విషయాలు నేర్చుకోవాలన్న చొరవను ఏమాత్రం దెబ్బతీయగూడదు. పిల్లలు ఒక సమస్యను పరిష్కరించడం కోసం, ఉదాహరణకు ప్లాస్టిక్‌భాగాలతో ఇల్లునిర్మించడానికి కృషి చేస్తుంటే, అక్కడేవున్న తల్లితండ్రులు ఫలానారీతిలో అమర్చాలనిచెప్పబోతారు. వారంతట వారు నేర్చుకోగల అవకాశాన్ని కల్పించరు. పిల్లలు తమంతటతాము అనేక విషయాలు నేర్చుకోకల్గుతున్నప్పుడే వారి మేధాశక్తి, హేతుబద్ధత, తార్కికశక్తి పెంపొందుతాయి. వారిలో ఆత్మవిశ్వాసం నెలకొంటుంది.

తల్లితండ్రులు పిల్లలపై నిరంతరం అనేక నిర్భంధాలు విధిస్తూ, అలావిధించకపోతే వారు విచ్చలవిడి ప్రవర్తనకు అలవాటుపడతారని భయపడుతుంటారు. ఏయే సందర్భాలలో పిల్లలపై నిర్భంధాలు విధించవచ్చో, వారికి క్రమశిక్షణాయుతంగా ప్రవర్తించడమెలా నేర్పాలో తల్లితండ్రులు స్పష్టంగా గుర్తించాలి. తమ ఇష్టాయిష్టాల కనుగుణంగా పిల్లలపై నిర్బంధాలు విధించడం తప్పు. టెలివిజన్‌ను చూడడం, ఆటలాడడం పిల్లలకు అమిత ఉత్తేజకరంగా వుంటుంది. తాము ఉత్తేజంపొందకుండా అనేకనిర్బంధాలు విధించడం వారికెంతో క్లేశాన్ని కలిగిస్తుంది. అందుకేవారు ఏయే సమయాల్లో వినోదం పొందవచ్చో ఎంచుకొనే స్వాతంత్ర్యాన్ని వారికే కల్పించాలి. అంతేకాదు. వివిధ విషయాలునేర్చుకోవడం వారికి ఆహ్లాదకరంగా వుండేటట్లు తీర్చిదిద్దాలి. అన్నివిషయాలను ఆటలు, పాటలరూపంలో నేర్పగలసౌలభ్యం ఈ ఆధునిక

కాలంలో లభ్యమవుతోంది. తమ అభిలాషలను, ఉద్రేకాలను, ఆవేశాలను ఎలా నియంత్రించుకోవాలో చిన్నతనంలోనే నేర్చుకొన్న పిల్లలు అత్యంత బాధ్యతా యుతంగా ప్రవర్తించడం నేర్చుకోకల్గుతారు.

పిల్లల ప్రవర్తనను చూసి ఆందోళనకు లోనవ్వడం, తరువాత జీవితంలో ఎలా రూపొందుతారోనన్న అభద్రతాభావాన్ని ఆదరించడం సహజంగానే తల్లితండ్రులందరిలో కనిపిస్తుంటుంది. ఈ ఆందోళన వలన పిల్లలకు ప్రయోజనకరమైన రీతిలో తల్లితండ్రులు ప్రవర్తించరు. ప్రక్కింటి పిల్లవాడు ఒకతప్పుచేస్తే, ఎటువంటి ఉద్రేకానికి లోనుకాకుండా, ఆ ప్రవర్తనను సరిదిద్దడానికి ప్రయత్నిస్తారు. అదేతప్పును తమ పిల్లవాడు చేస్తే, అంతే తాపీగా, ప్రశాంతంగా దానిని సరిదిద్దరు. అనవసరమైన ఉద్రేకానికి లోనవుతారు. ఇందుకు భిన్నంగా, తమ పిల్లలవద్ద అనవసర కోపతాపాలు ప్రదర్శించకుండా, చెప్పదలచుకొన్న విషయాన్ని సరళంగా చెప్పడం తల్లితండ్రులందరూ అలవరచుకోవాలి. ఒకసారి ఒక విషయాన్ని చెప్పినప్పుడు పిల్లలు దానిని సరిగ్గా ఆవగతం చేసుకోలేకపోతే దానికి వారిని నిందించడం సబబుకాదు. వారికి స్పష్టంగా అర్ధం అయివుండదు. లేదా అందుకు విరుద్ధమైన అంశం వారి మనస్సులో వుండివుండవచ్చు. చిన్నపిల్లవాడు పసితనంలోనీళ్ళు ఒలకబోయడాన్ని తల్లి పెద్దగా పట్టించుకొని వుండదు. తరువాత కొన్నిరోజులకు ఇలా ఒలకబోయడం తప్పని చెబుతుంది. ఆ పిల్లవాడికి, ఇలా ఒలకబోయడం వున్నట్లుండి తప్పెలా అయ్యిందో ఆర్ధంకాదు. అందుకే మొదటిసారి తప్పని చెప్పగానే పిల్లవాడు తన ప్రవర్తనను మార్చుకోకపోవచ్చు. ఒకటికి పదిసార్లు అదేవిషయాన్ని స్థిరంగా చెప్పడమేకాకుండా, ఎందుకు పారబోయగూడదోకూడా వివరించి చెప్పాలి. చాల మంది తల్లితండ్రులు పిల్లల ప్రవర్తన వలన సంభవించే పరిణామాలను గురించి పట్టించుకొంటారే తప్ప, ఆ ప్రవర్తన వెనుకవుండే వారి ఆలోచనాధోరణిని గురించి పట్టించుకోరు.

అత్యధికశాతం మంది తల్లితండ్రులు పిల్లలతో తమకు తోచినట్లు ప్రవర్తించబోతారు. అదే తమ సహజ ప్రవర్తన అనుకొంటారు. తమ సహజప్రవర్తన అని భావించేదంతా, తాము తెలిసీతెలియని వయస్సులో నేర్చుకొన్నదేనని వారు గుర్తించరు. అంతేకాదు. తమ ప్రవర్తన ఎలావుంటే అది పిల్లలపై మంచి ప్రభావం కలిగిస్తుందో, వారికి ప్రయోజనదాయకంగా రూపుదిద్దుకొంటుందో చాలమంది గుర్తించరు. ఇంట్లోనలుమూలలా వీడియో కెమెరాలు అమర్చబడివున్నాయని, తమప్రవర్తనను లక్షలాది మంది

వీక్షిస్తున్నారన్నప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ప్రవర్తించడానికి ప్రయత్నిస్తారు. తమ స్వేచ్ఛకు కొన్ని హద్దులేర్పరచుకొంటారు. అదే కోవలో పిల్లలతో ప్రవర్తించే సమయంలో కూడా ప్రతి ఒక్కరూ తమకుతాము కొన్ని హద్దులు ఏర్పరచుకోవాలి. తమ ప్రవర్తనను నిశితంగా పరిశీలించుతూ, అటువంటి ప్రవర్తనను ఆయాచితంగా అలవర్చుకొనే పిల్లలకు ఎన్నడూ ప్రతికూల సంకేతాలను, సందేశాలను అందించగూడదు. తమ కార్యాలయంలో, తమపై అధికారివద్ద, కుటుంబ పెద్దలవద్ద ఎలా ప్రవర్తిస్తాము? వారికి మనపట్ల సదభిప్రాయం కలిగే విధంగా, అభినందనలు అందుకొనే రీతిలో మన హావభావాలను, మన సంభాషణను తీర్చిదిద్దుకొంటాము. అదేరీతిలో చిన్న పిల్లలఎదుట కూడా తమ ప్రవర్తనను ప్రయోజనకరమైన రీతిలో తీర్చిదిద్దుకోవాలి.

ఒక మహారాజు తనపిల్లవాడిని మీ ఇంట్లో వుంచి, అతడిని ప్రయోజకునిగా తీర్చిదిద్దితే మీకు కోట్లరూపాయిల పారితోషకాన్ని అందిస్తానని చెబితే ఆ యువరాజుతో మీ ప్రవర్తన ఎలావుంటుంది? అతనిని విమర్శించరు. విసుక్కోరు. చులకనగా చూడరు. అన్నివిషయాలను అతి ఓపిగ్గా నేర్పుతారు. అతనికి సులభంగా అర్ధం అయ్యేట్లు అన్నీ వివరించి చెబుతారు. ఖచ్చితంగా మీ ఇంట్లోకి ఒక పసిపాప ప్రవేశించినప్పుడు జరిగేది ఇదే! మీరు ఆ పసివానిని ప్రయోజకునిగా తీర్చిదిద్దండి. మీరేనాడూ ఊహించి ఎరగనంతటి పారితోషకం మీకు లభించితీరుతుంది.

మీ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి మీకు నిరంతరం తోడ్పడే గ్రంధం ఇది. ఈ గ్రంధంలో వివరించిన వివిధ అంశాలను మీరు అవగతంచేసుకొని, ఆస్ఫూర్తితో, మీ చిన్నారులను ఉన్నతంగా తీర్చిదిద్దాలను కొంటున్నందుకు ముందుగా నా అభినందనలు అందుకోండి. ఇందులోని వాక్యాలన్నీ మీ పిల్లలకు శుభాశీస్సులుగా ఉపకరిస్తాయి.

– సి.నరసింహారావు

408, విజయ టవర్స్,
శాంతి నగర్,
హైదరాబాద్–500028.
ఫోన్: 66665146, 9866181388

చిన్నారులు

పసితనపు స్పర్శ, మాతృత్వపు అనుభవం తల్లికి అపూర్వ తన్మయత్వాన్ని కలిగిస్తుంది. తల్లి తండ్రులు తమ హృదయాలలో చెలరేగే అంతులేని పారవశ్యాన్ని, ప్రేమానురాగాలను, మమతానుబంధాన్ని, వాత్సల్యాన్ని, ఇతర మృదుమధుర భావనలను నిరంతరం తమ చిన్నారుల వద్ద వ్యక్తంచేస్తూ పులకరించిపోతుంటారు.

పిల్లలు పసితనాన్ని అధిగమించాక సైతం, పసితనంలో వారు తమ హృదయ తంత్రులపై మీటిన మనోహర స్పందనల ప్రకంపనాల నుండి చాలమంది తల్లితండ్రులు బయిటపడలేరు. పెరిగే పిల్లల పట్ల తమ బాధ్యతలను గుర్తించకుండా, వారి పసితనం తమ అంతరంగంలో రేపిన పారవశ్యానికనుగుణంగా నిరంతరం ప్రతిస్పందించబోతారు.

సరిగ్గా ఈ ప్రవర్తనే పిల్లల్ని క్రుంగదీస్తుంది. అందుకే పిల్లలు ఉన్నతంగా ఎదగడానికిగాని, అందుకువిరుద్ధంగా మిగిలిపోవడానికిగాని

తమ ప్రవర్తన,తాము కలిగించే ప్రభావాలే మూల కారణాలవుతాయని తల్లితండ్రులు గుర్తించితీరాలి. పిల్లలకు తల్లితండ్రులు నేర్పవలసింది చదువు మాత్రమే కాదు. పిల్లలు తమ మనోభావాలను ఎలా గుర్తించాలో, ఎలా వ్యక్తంచేయాలో, తమ ఉద్రేకాలను

ఎక్కడ ఎలా అదుపుచేసుకోవాలో, ఏ రీతిలో వ్యక్తంచేయవచ్చో, తమ అభిరుచులను ఎలా పెంపొందించుకోవాలో తల్లితండ్రులు

మున్ముందుగా నేర్పాలి. చట్టూవున్న ప్రపంచాన్ని కొద్దికొద్దిగా అర్థంచేసుకోవడానికి పిల్లలు చేసే ప్రయత్నాలకు చేయూతనివ్వాలి. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని, చొరవను, స్వతంత్రతను ఎలా పెంపొందించాలో గుర్తించాలి.

తల్లి కాగలమని, తండ్రి కాగలమని ఏదో అస్పష్టంగా భావించు కొంటుండవచ్చు. కాని ఇప్పుడా భావన ఓ వాస్తవంగా రూపొందుతుంది. ఈ సందర్భంలో ఎంతో సంతోషం కలగవచ్చు. కాని అదే సమయంలో ఎన్నో అనుమానాలు, భయాలు కూడా చోటుచేసు కుంటాయి.

తొలిసారిగా మాతృత్వం పొందే వారి ఆలోచనలు ఎలా సాగుతుంటాయి?

అతి త్వరలోనే మీ ఇంట్లోకి ఓ చిన్నారి పాప రాబోతుంది. మీరు తల్లి కాబోతున్నారు. మీ జీవితమంతా ఇప్పటివరకూ ఓ కోవలో సాగిపోతుండవచ్చు. కాని చిన్నారి జన్మించిన తరువాత మీ దైనందిన కార్య కలాపాల్లో మార్పులు వస్తాయి. మీ ఆలోచనా ధోరణిలో సైతం అనేక మార్పులు వస్తాయి. చాలామందికి తల్లికావడమంటే ఓ అభిప్రాయం, ఓ భావన వెంటనే ఏర్పడుతాయి. తల్లి కావడమంటే పూర్తి సుఖసంతోషాలను, ఆనందాన్ని అంది పుచ్చు

కోవడమే తప్పు పట్టించుకో దగిన సమస్యలేమీ ఎదురుకావని ముందుగా అనుకొంటుంటారు. ఇటువంటి అభిప్రాయం వుండడం వలన తరువాత ఎదురైన సమస్యల్ని సమర్థవంతంగా ఎదుర్కోలేక నిస్పృహకు లోనవ్వడం జరుగుతుంటుంది. ఇంతవరకూ యువతీయువకులుగా వున్నవారు ఇప్పుడు తల్లితండ్రులు కాబోతున్నప్పుడు–జీవితంలో అత్యంత ప్రధానంగా పేర్కొనదగిన ఈ పరిణామాన్ని యధాతథంగా స్వీకరించడానికి వారు సంసిద్ధం కావాలి.

తీవ్ర సంతోషాతిరేకానికి లోనుకారు

తల్లితండ్రులు కాబోతున్నప్పుడే ఏర్పడే బాధ్యతలేమిటో, వాటినెలా నిర్వహించాలో తెలియజేయడానికి ఎవ్వరూ ప్రయత్నించరు. మన సినిమాల్లో బూటకపు సన్నివేశాలు కొన్ని వుంటాయి. భార్య ఓ చోట కూర్చుని స్వెటరు అల్లుతుంటుంది. ఇంతలో ఆమె భర్త వస్తాడు. ఆమె అతన్ని చూసి సిగ్గుపడుతుంది. అతను ఆశ్చర్యపోతాడు. ఆమె చెప్పలేక చెప్పలేక చివరకు అతను తండ్రి కాబోతున్నట్లు చెబుతుంది. అతను ఓ పాట మొదలుపెడతాడు. శివం ఎక్కిన వ్యక్తిలా ఆమెను కౌగలించుకొంటాడు. గిర్రున తిప్పుతాడు ఇద్దరూ పాటపాడడం పూర్తి చేస్తారు. ఈ మధ్యలో అతను అనేక వేకిలివేషాలు వేస్తాడు. సినిమాల్లో చూపించే ఈ సన్నివేశం కేవలం కృతకమైనదని మనందరికీ తెలుసు. కాని ఈ దృశ్యం భర్త మనోఫలకంపై ముద్రించబడుతుంది. నిజజీవితంలో తండ్రి కాబోతున్న వార్త విన్న తరువాత అతనికా సన్నివేశం జ్ఞాపకం వస్తుంది. తనలో అంతటి తీవ్రస్థాయిలో ఆనందోద్రేకాలు చెలరేగవు. అందుకే తనలో ఏదో లోపం వుందని భావించుకోవడం కూడా జరగవచ్చు. తండ్రి కాబోతున్న విషయాన్ని విన్నప్పుడు తనకు సైతం సంతోషం కలుగవచ్చు. కాని సినిమాల్లోలాగ తీవ్రమైన సంతోషాతిరేకానికి ఎవ్వరూ లోనుకారు.

అనుకోకుండా పుట్టే పాపను అపురూపంగా చూసుకొంటారు

అతి కొద్దిమందికి మాత్రమే తమకు పాప పుట్టాలని ఎదురుచూస్తున్నప్పుడు వారి అభిలాష నిజం కావడం జరుగుతుంది. చాలామంది ఈ విషయం గురించి అసలు ఆలోచించకముందే గర్భవతులు కావడం జరుగుతుంది. పాప కావాలని అనుకొంటూనే అది అంతటి ప్రధానమైన విషయం కాదనుకొనే నూతన దంపతులు ఓ రెండు సంవత్సరాల పాటు పిల్లలు లేకుండా తాము జీవితాన్ని ఉల్లాసకరంగా గడపాలనుకొంటారు. అప్పుడు ఈ ఎదురుచూడని పరిణామం ఎదురుకావచ్చు. మొదట్లో నిర్ఘాంతపోయినా క్రమంగా ఆ సంఘటనను సమర్థించుకోబోతారు. తల్లి కావడానికి ఇదే సరైన సమయమని భావించుకోవడం మొదలవుతుంది. ఎదురుచూడకుండా గర్భం ధరించిన తల్లులు తమ పాపల పట్ల ఇతరులకంటే అత్యధిక జాగ్రత్తలు గైకొంటారు. ఇప్పట్లో వద్దనుకొన్నందుకు పశ్చాత్తాపపడుతున్నట్లుగా వీరు ఇప్పుడు తీవ్రమైన సంతోషాన్ని వ్యక్తం చేస్తారు.

కొంతమంది వివాహమైన మరుక్షణం నుండీ తమకు పిల్లలు కలగాలని ఎదురుచూస్తుంటారు. ప్రతినెలా ఋతుస్రావం నిలచిపోతుందేమోనని ఎదురుచూస్తుంటారు. కాని ఫలితం కన్పించదు. చాలాకాలానికి వారు గర్భం ధరించడం జరుగుతుంది. ఇటువంటి

వ్యక్తులు తమ పాప పట్ల లేనిపోని జాగ్రత్తలు తీసుకోవడం మొదలు పెడతారు. ఎంతోకాలం ఎదురుచూసి, కొద్దిపాటి నిరాశను నింపుకొన్న తరువాత జన్మించిన పాపపట్ల అత్యధిక శ్రద్ధను కనబరుచుతూ ఆ పాప తనంతటతానుగా ఏమీ నేర్చుకోలేకపోవడానికి కారకులవుతారు. తాము కోరిన సమయంలో పాపను పొందకల్గిన వారికి, ఎంతోకాలంగా ఎదురు చూసిన వారికి, పిల్లలను పెంచే విషయంలో ఎంతో తేడాకన్పిస్తుంది.

తమ మనస్సులోని ఆందోళన పిల్లలపై ప్రసరించగూడదు

తల్లి కాగలమని, తండ్రి కాగలమని ఏదో అస్పష్టంగా భావించుకొంటుండవచ్చు. కాని ఇప్పుడా భావన ఓ వాస్తవంగా రూపొందుతుంది. ఈ సందర్భంలో ఎంతో సంతోషం కలగవచ్చు. కాని అదే సమయంలో ఎన్నో అనుమానాలు, భయాలు కూడా చోటుచేసుకుంటాయి. వాటివలన ఆందోళన తలఎత్తుతుంది. ఇలాంటి ఆందోళన ప్రతి ఒక్కరిలోను తలెత్తుతుంది. ఇది సహజమేనని అనుకొంటూ చాలామంది దీనిని అణచిపెట్టుకోజూస్తారు. అలాకాకుండా తమలో తెలెత్తిన సంతోషాన్ని, ఆందోళనను విడివిడిగా గుర్తించి ఇవి కలగడం సహజమని భావించుకొంటే తరువాత ఈ ప్రభావం పిల్లలపై వుండబోదు.

అతిజాగ్రత్తల వలన పిల్లల ఎదుగుదల సవ్యంగా వుండదు

నిర్మలకు ఒక్కడే బాబు. అతనికి నాలుగు సంవత్సరాలు వచ్చాయి. కాని ఏడాది పిల్లవాడిలా ప్రవర్తిస్తుంటాడని, ఎప్పుడూ తనను ప్రక్కనే వుండమంటాడని ఆమె ఆరోపిస్తుంది. అసలు విషయమేమిటంటే నిర్మల, ఆమె భర్త అతి తరచుగా వాగ్వివాదానికి దిగుతుంటారు. ఊరకనే కలహించుకొంటూ వుంటారు.దీనికంతటికి కారణం నువ్వంటే నువ్వని ఒకరిపై ఒకరు ఆరోపించుకొంటుంటారు. బాబును సరిగ్గా చూడడంలేదని ఇద్దరూ ఓ నిర్ణయానికి వస్తారు. నిర్మల తనకు గర్భిణీ వచ్చినప్పుడు ఏదో అద్భుతం జరిగిపోనున్నదని అనుకొంది. మాతృమూర్తి కావడం చాలా గొప్ప విషయమని, అభినందనీయమని అనుకొంటూ తనకీ అద్భుత అనుభవం పొందగల అర్హత లేదేమోనని భయపడసాగింది. తాను గర్భం ధరించినా ఏమయినా ప్రమాదం జరిగి తాను ఎదురు చూస్తున్న బాబు జన్మించిక పోవచ్చునేమోనని భయపడి పోవడం మొదలు పెట్టింది. తాను భయపడుతున్నదే జరిగితే తన భర్తకు తనపై ఆసక్తి నశించవచ్చేమోనని శంకించడం ప్రారంభించింది. ఈ భావనలను సవ్యంగా గుర్తించి అర్థం చేసుకోవడానికామె ప్రయత్నించలేదు. ఇటువంటి భావాలు కలగడం సహజమేనని అనుకోకపోవడం వలన ఆమెలో అపరాధ భావన ప్రతిష్టితమైంది. ఈ అపరాధ భావన వలన ఆమెలో ఉద్రిక్తత ఉద్భృతమై తనకు బాబు పుట్టిన తరువాత అతని పట్ల లేనిపోని జాగ్రత్తలు తీసుకోవడం మొదలు పెట్టింది. ఆమె ఇలా ప్రవర్తించే సరికి బాబు మానసికంగా ఎదగలేక ఆమెనే పట్టుకు వ్రేళ్ళాడడం మొదలు పెట్టాడు. అతను తల్లిని వదలిపెట్టి వుండడానికి భయపడడమెలా వున్నా ఆమె అతన్ని వదలి ఒక్క క్షణం గడపడానికి కూడా భయపడుతుండేది. ఆమెలో గూడుకట్టుకు వున్న ఈ ఉద్రిక్తత వల్లనే భర్తతో సైతం అకారణంగా కలహించేది. తనను భర్త అర్థం చేసుకోవడం లేదని వాపోయేది. తనకు ఇటువంటి భావాలు కలగడం సహజమేనని ఆమె భావించి వుంటే-వాటిని గురించి భర్తతో చర్చించేది. ఫలితంగా ఈమె

కెటువంటి అపరాధ భావన కలిగేది కాదు.

ఆలోచనలు రావడం సహజం

ఓ పాప జన్మించబోతుందని రూఢిగా తెలుస్తుంది. ఆ తరువాత సహజంగానే తమ ఆలోచనలు వివిధ దశల్లో పయనిస్తాయి. 'నేను పిల్లల్ని ఎలా పెంచాలి? నా తల్లితండ్రులు నన్ను పెంచిన కోవలో మాత్రం నేను నా పిల్లల్ని పెంచబోను' అనుకొంటారు. ఆ తరువాత 'ఆడపిల్ల పుడుతుందో; మగపిల్లవాడు పుడతాడో' అని అనుకోవడం మొదలవుతుంది. మొదట్లో ఆడపిల్లతే ఏమిటి? మగపిల్లవాడయితే ఏమిటి అనుకొన్నా కొన్ని రోజులకు తనకు మగపిల్లవాడే పుట్టాలని నిర్ణయించు కోవడం గాని ఆడపిల్లే పుట్టాలని ఎదురు చూడడం గాని జరుగుతుంది. ఆ తరువాత ఆ పాప ఎలా వుండాలి? పెద్దయిన తరువాత ఏం చదవాలి? ఎటువంటి వారికిచ్చి వివాహం చేయాలి? మొదలైన ఆలోచనలన్నీ వస్తాయి. ప్రతి ఒక్కరూ తమ పాప ఎంతో ఆరోగ్యంతో, ఎంతో సంతోషంగా తెలివిగలదిగా వుండాలని అనుకొంటారు. అంతేకాదు క్రమంగా తమలో లేని గొప్పతనాలన్నీ తమ పిల్లలు సంతరించు కోవాలని ఎదురుచూడడం ప్రారంభమవుతుంది. ఇటువంటి ఆలోచనలన్నీ ముసురుకోవడం సిగ్గనిపించి వాటిని వైదొలగించుకోవాలని వీరు ప్రయత్నించవచ్చు. కాని ఎంతగా ప్రయత్నించినా ప్రయోజనం వుండబోదు. ఇటువంటి ఆలోచనలు రావడం చాలా సహజం.

అపురూపంగా పెంచాలన్న అభిలాషలు

ఈ ఊహలన్నీ రెండు కోవలలో వుంటాయి. తాము ఎటువంటి తల్లిగాని, తండ్రిగాని కాగోరుతున్నారో నన్న అభిలాషల కనుగుణమైన ఆలోచనలు, తమ పాప ఎలా రూపొందాలని అభిలాషిస్తున్నారో ఆ ఊహలు కలగలసి రెండూ వారి ఊహాపథంలో మిళితమైపోయి వుంటాయి. పెద్ద వ్యాపారం చేసి, బాగా డబ్బు సంపాదించి, ఓ భవంతిని నిర్మించి, ముందు పూలతోట పెంచి మీ పాపకు అన్ని సౌకర్యాలు సమకూర్చి ఆ తరువాత చదువుకు ఎంత ఖర్చయినా వెనుదీయకుండా, విదేశాలకు పంపించి ఇలా ఆలోచనలు సాగుతుంటాయి. ఇలాంటి ఆలోచనలు రావడం అసహజం కాదు. కాని తమ ఆశయాలకు, అభిలాషలకు అనుగుణంగా తమ పిల్లలను తీర్చిదిద్దాలని వీరు ప్రయత్నించుతుంటే అది పిల్లలపై ఎంతో దుష్ప్రభావాన్ని కలిగిస్తుంది.

తమ జీవితంలో మిగిలిపోయిన కోర్కెలు పిల్లల ద్వారా తీర్చుకోగోరుతారు

తల్లితండ్రులు తమ పిల్లలపై ఎన్నెన్నో ఆశలు పెట్టుకొంటారు. వాటిలో కొన్నింటిని వారు పైకి వ్యక్తీకరించగలరు. మిగిలిన వాటిని వారు తమ హృదయంలోనే దాచుకొంటారు తప్ప మరెవరికీ తెలియపర్చరు. ఇతరులతో చెప్పలేని రహస్య అభిలాషలు తమకున్నాయని సైతం వారు అంగీకరించకపోవచ్చు. ఎందుకిలా వీటిని ఆదరించడం జరుగుతుంది? తమ జీవితంలో తాము సాధించలేక, అలాగే మిగిలిపోయిన అభిలాషలను తమ పిల్లలు నెరవేర్చాలని వారు ఎదురుచూస్తారు. అంతేకాదు. తాము జీవితంలో సాధించిన విజయాలు తమ పిల్లలు కూడా సాధించాలని వారు కోరుకొంటారు. ఈ విషయాన్ని వారు బహిరంగంగానే

అంగీకరిస్తారు. మిగతావి సైతం వెల్లడించబోతే, నలుగురూ ఎక్కడ నవ్వుతారో నన్న భయంతో వారు ఎవ్వరికి చెప్పబోరు. కాని ఇదంతా చాలా సహజమైన విషయం.

సంతోషం, భయం, అనుమానం

గర్భం వచ్చినప్పుడు ఒక క్షణంతో బాబు పుడతాడని అనుకోగానే ఎంతో ఆనందం కలుగుతుంది. మరో క్షణంలో ఏదో తెలియని భయం, అనుమానం ఆవహిస్తాయి. మాతృమూర్తి కాగల అర్హత తనకు లేదేమోనని అనుకోవడం జరుగుతుంది. ఇలా సంతోషం, భయం ఒక దాని తరువాత ఒకటి కలుగుతుంటే కొంతకాలానికి తమ దృష్టి తమకు పుట్టబోయే పాపపై నుండి తమ పైకే మళ్ళుతుంది. ప్రసవం అయ్యేప్పుడు కలిగే బాధ, అప్పుడు ఏర్పడే క్లిష్టతలను గురించి ఆలోచించడం మొదలవుతుంది. కథల్లోను, నవలల్లోను చదివిన రీతిలో అదో భయంకరమైన అనుభవమనుకోవడం జరుగుతుంది. ఇంట్లోని ముసలమ్మలు ప్రాణాపాయం సంభవించిన సంఘటనలను, అవిటితనంలో పుట్టిన పిల్లల్ని గురించిన కథలు చెప్పవచ్చు. తమ విషయంలో ఇలా జరగదని తెలుసు. మామూలు సమయంలో అయితే వీటిని త్రోసిపుచ్చకలుగుతారు. కాని ఇప్పుడు ఈ కథలను వీరు మరచిపోలేరు. ఇకపై ఏదో పెద్ద బాధ్యత వహించాలన్న ఆలోచన వలన తమకు తెలిసిన ఏ సమాచారాన్నయినా వీరు గ్రహించబోతారు. ఈ సమయంలో ఏమి విన్నా, దాన్ని నమ్మివేబోతారు. అవన్నీ కట్టుకథలని, ఎవరికీ జరగవని తెలిసినా వీరు వాటిని త్రోసిపుచ్చలేరు. ఒక యువతి తల్లిగా మారే సమయంలో రకరకాల ఆలోచనలు కలిగి ఆ పరివర్తన పూర్తవుతుంది. అందుకే రకరకాల ఆలోచనలు ఇంతవరకూ తోద్పడివుండవచ్చుగాని ఇకపై ఆ ప్రవర్తనను సవరించుకోవడానికి సంసిద్ధులుకావాలి.

చిన్నపిల్లల ప్రవర్తనకు బాధ్యతను పూర్తిగా తల్లితండ్రులపై నెట్టివేయడం పొరపాటు. తల్లితండ్రుల ప్రవర్తనను పిల్లలు కూడా ప్రభావితం చేసే సందర్భాలెన్నో వుంటాయి. చిన్నపిల్లవాడు తనపై అధికారం చెలాయించయినా తనపట్ల శ్రద్ధ వ్యక్తం చేయాలని ఎదురుచూస్తున్నప్పుడు తండ్రి అలానే ప్రవర్తించవచ్చు. తమకు అధిక రక్షణ కావాలని ఎదురుచూసే పిల్లలు, తామెంతగానో ఎదిగినా పసిపిల్లలాగా చూసే తల్లి ప్రవర్తనను ఆహ్వానిస్తారు. తల్లితండ్రులు ప్రోత్సాహపరిచేవిధంగా లేక నిరుత్సాహ పరిచేట్లు ప్రవర్తించ వచ్చు. వారి ప్రవర్తన నుండి తాము స్వీకరించవలసినవేవో, తిరస్కరించవలసినవేవో గ్రహించడంపైనే పిల్లల తరువాతి వ్యక్తిత్వం ఆధారపడివుంటుంది.

పిల్లలు ఏ అలవాట్లను నేర్చుకొంటారోనని మీరు అనవసరమైన జాగ్రత్తలు గైకొనవద్దు. మీరు మామూలుగా ప్రవర్తించండి. మిమ్మల్ని అనుకరిస్తూ పిల్లలు సైతం అలాగే ప్రవర్తించడం నేర్చుకొంటారు. స్వతంత్రతను అలవరచు కొంటారు. మీరు వాళ్ళను శాసిస్తూ,అలా ప్రవర్తించమని, ఇలా మెలగమని నిర్దేశించుతుంటే వారు మీ నుండి నేర్చుకోవడాన్ని మాని, మిమ్మల్ని సంతోష పరచడం ఎలాగో మాత్రమే నేర్చుకొంటారు.

అనేక విషయాలు నేర్పడం మాని అనుక్షణం శాసించవద్దు.

పిల్లలు పుట్టబోతున్నారని తెలిసినప్పుడు మీ కెలాఅనిపిస్తుంది? మరి కొన్ని బాధ్యతలు, సమస్యలు వచ్చిపడతాయని మీరు భావించ

వచ్చు. పిల్లలు పుట్టిన తరువాత సైతం మీదృక్పథం ఇలాగే వుంటుంది. మీరు ఎప్పుడైనా పనిమీద మరొక ఊరు వెళతారు. అప్పుడు మీ చిన్నారి పాపే మీ మదిలో మెదులుతుంది. ఆ పాపను వదలివచ్చినందుకు మిమ్మల్ని మీరు నిందించుకొంటారు. మళ్ళీ ఇంటికి తిరిగిరాగానే ఇదంతా మరచిపోతారు.

పసిపిల్లను అతిజాగ్రత్తగా సాకాలని, ఒక్క నిమిషం కూడా ఏమరుపాటు కూడదని, వాళ్ళ పాప పనులన్నీ జాగ్రత్తగా పూర్తి చేయాలని భావించుతుండడమే ఇందుకు కారణం కావచ్చు. మీ తల్లితండ్రులు పిల్లలతో ఆడుకొంటుంటారు. పిల్లల చేష్టలు చూస్తూవారెంతగానో మురిసిపోతుంటారు. అలా మీరెందుకు పరవశించలేరు? ఇందుకు వేరే కారణమేదీలేదు. పిల్లల బాగోగులను గురించి మీరు నిరంతరం మథనపడుతుండడమే ఇందుకు కారణం.

నిరంతరం నిర్దేశిస్తుంటే పిల్లలు మీనుండి ఏమీనేర్చుకోలేరు

ఏమవుతుందో, పిల్లలు ఏమి అలవాట్లను నేర్చుకొంటారోనని మీరు అనవసరమైన జాగ్రత్తలు గైకొనవద్దు. మీరు మామూలుగా ప్రవర్తించండి. మిమ్మల్ని అనుకరిస్తూ పిల్లలు సైతం అలాగే ప్రవర్తించడం నేర్చుకొంటారు. స్వతంత్రతను అలవరచుకొంటారు. అలాగాక మీరు వాళ్ళను శాసిస్తూ,అలా ప్రవర్తించమని, ఇలా మెలగమని నిర్దేశించుతుంటే వారు మీ నుండి నేర్చుకోవడాన్ని మాని, మిమ్మల్ని సంతోషపరచడం ఎలాగో మాత్రమే నేర్చుకొంటారు. మీ పిల్లలను సరిదిద్దవద్దని ఎవ్వరూ చెప్పరు. కాని నిరంతరం వారి చేష్టలను గమనించుతూ ప్రతిక్షణమూ హెచ్చరికలు, జాగ్రత్తలు జారీచేయవద్దు. మీరిలా అనుక్షణం వారిని పట్టించుకొంటుంటే-అది పిల్లలకు చాలా బాధాకరంగా తోస్తుంది.

మొదటి పాపకు, తరువాత పాపకు తేడా అంతా మీ అమిత శ్రద్ధవల్లే వచ్చింది

ఈ తేడాను మనం తేలిగ్గా గమనించవచ్చు. ఇద్దరు పిల్లలున్న తల్లితండ్రులను గమనించండి. మెదటి పాపను ఎత్తుకోబోతే ఆ పాప విసుక్కొంటుంది తండ్రికి దూరంగా జరుగుతుంది. రెండవ పాప తండ్రి ఒడిలో కూర్చోవడానికి ఉత్సాహం చూపుతుంది. ఈ ఇద్దరి మధ్యా ఈ తేడా ఎందుకు వుంది? అన్ని కుటుంబాలలోను ఇది చోటు చేసుకోక పోవచ్చు. కాని చాల కుటుంబాలలో మొదటిపాప జన్మించగానే లేని పోని శ్రద్ధ కన్వరుస్తారు. అనవసరమైన జాగ్రత్తలు గైకొంటూ ఆ పాపను విసిగించి వేస్తారు. ఎనలేని ఆత్రుతను ప్రదర్శిస్తారు. ముక్కు వెంబడి నీరుకారితే చాలు. జలుబు చేసిందని కంగారుపడిపోతారు. ఇంకా సరిగ్గా కూర్చోలేక పోతోందని గాభరా పడతారు. ఇంకా మాటలు ఉచ్ఛరించలేక పోతోందని దిగులు చెందుతారు. సరిగ్గా నిద్రపోలేదని విచారిస్తారు. ఇక రెండవపాపపుట్టిన తరువాత తల్లితండ్రులు ఇంతటి శ్రద్ధను కన్వరచరు. పిల్లలందరూ ఒకేలా వుండరని గుర్తించ కల్గుతారు. తమ పాప ఎదుటివారి పాపలా ప్రవర్తించలేకపోవడంలో విచారించదగిన దేమీ లేదని గ్రహించ కల్గుతారు. ఇటువంటి స్వల్పమైన విషయాలకు అత్యధిక ప్రాధాన్యత నివ్వడం మానివేస్తారు.

చిన్న పిల్లలు స్వాతంత్ర్యం కావాలనుకొంటారు

ముందుగా పాప పుట్టినప్పుడు ఆ పాపను పెంచడం తమకు తెలియకపోవచ్చని

భయపడతారు. కాని మొదటి పాప పెద్దదై, రెండవపాప పుట్టిన తరువాత పిల్లలను సవ్యంగానే పెంచగల శక్తి తమకున్నదని వారు గ్రహిస్తారు. ఆత్మవిశ్వాసాన్ని సంతరించుకొంటారు. రెండవ పాపతో తాపీగా, ప్రశాంతంగా, ఎటువంటి ఆందోళనా లేకుండా ప్రవర్తించ కల్గుతారు. చిన్నారి పిల్లలు కూడా తమకు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించగల స్వాతంత్రం వుండాలను కొంటారు. తమ ఇష్టం వచ్చిన నిర్ణయాలు తీసుకోవాలనుకొంటారు. ఏ ఆటబొమ్మతో ఆడుకోవాలో తమకై తాము నిర్ణయించుకోవాలి. తాము నిన్న ప్రీతిదాయకంగా తిన్న ఆహారాన్ని ఈ రోజు తిరస్కరిస్తారు. మరుసటిరోజు మళ్ళీ దాన్ని తింటారు. ఇలాగే జరగాలని వారు అభిలషిస్తారు. వారి ఆలోచనాస్థాయి ఇంత ఎత్తుకు ఎదగక పోవచ్చు. కాని వారి సహజ ప్రవర్తనే ఈ తీరులో వుంటుంది. తల్లితండ్రులు తమపై అధికారం చెలాయించడాన్ని, తమను అదుపుచేసేలా ప్రవర్తించడాన్ని వారు సహించరు.

ఏమవుతుందోనన్న భయం వద్దు

ఏ బొమ్మలతో ఆడుకోవాలో, ఏ దుస్తులు ధరించాలో, ఎక్కడ పడుకోవాలో తల్లితండ్రులు చెప్పబోతే, చిన్నారి వయస్సులోనే పిల్లలు ధిక్కరించబోతారు. ఈ ధిక్కరణా స్వభావం తరువాత కూడా అలాగే మిగిలిపోవచ్చు. పిల్లలందరిలోకి పెద్దతను ఈ ప్రవర్తనను అలవరచుకొంటాడు. తరువాత పుట్టిన పిల్లలకు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించగల స్వాతంత్ర్యాన్ని తల్లితండ్రులే కల్పిస్తారు. అందువలన తమకు చేరువైన వారందరినీ తమపై అధికారం చెలాయించేవారుగా వీరు పరిగణించరు. అందుకే పిల్లలపట్ల అమితశ్రద్ధ కనబరచవద్దు. వారిని ఎప్పుడూ ఎత్తుకొంటూ, బయటకు వెళ్ళనిస్తే ఏమవుతుందోనని భయపడవద్దు. పిల్లలే కావాలనుకొన్నప్పుడు తమంతట తాము తల్లి కౌగిలిలోకి వచ్చి జేరుతారు. తల్లితో ఓ నిమిషం సేపు గడిపి తిరిగి ఆటలో మునిగిపోతారు.

పిల్లల్లో చొరవను దెబ్బతీయవద్దు

చిన్నపిల్లల ప్రవర్తనలో తమ బాల్యానుభూతులను దర్శించకల్గిన తల్లితండ్రులు ఎంతో ఆనందాన్ని పొందకల్గుతారు. అందుకే పిల్లలతో నూతనానుభవాలను కలిసి పంచుకోవడానికి యత్నించండి. మీ పాపకు రెండు సంవత్సరాలు వచ్చాయి. మీ పాప ఆడుకోవడానికై బొద్దుగా వున్న కుక్క పిలను తీసుకువచ్చారు. ఆ కుక్క పిల్లను చూసి మీ పాప ముందుగా భయంతో ముఖం చిట్లించుకొంటుంది. దూరంగా జరిగిపోతుంది. అపూర్వమైన ఆసక్తితో ఇంతలోనే ఆ కుక్క పిల్లకు చేరువకాబోతుంది. ఆ కుక్క పిల్లను మరికొంతసేపయిన తరువాత స్పర్శించబోతుంది. వెంటనే మహా విజయం సాధించినట్లు మీ పాప మురిసిపోతుంది. తన ధైర్యాన్ని తలచుకొని గర్విస్తుంది. మధ్యలో మీరు ప్రమేయం కల్పించుకోవడానికి యత్నిస్తే పాపకు నిజమైన ఆనందాన్ని, చొరవను దూరం చేసినవారవుతారు.

అలాగే ఓ క్రొత్త యంత్రాన్ని, కొత్త వస్తువులను, రకరకాల జంతువులను చూడడానికి పిల్లలెంతో ఆసక్తిని కన్పరచుతారు. ఈ సందర్భంలో తల్లి తండ్రులు కొన్ని జాగ్రత్తలు గైకొనాలి. పెద్ద పిల్లలను, చిన్నపిల్లలను కలిపి బయటకు తీసుకువెళ్ళితే పెద్ద పిల్లలు ముందుగా నడచిపోతుంటారు. చిన్న పిల్లలు వెనుకబడి పోతున్నామనుకొంటూ అవమానకర

భావనకు లోనవుతారు. అందుకే చిన్న పిల్లలతో పాటు తల్లి, పెద్ద పిల్లలతో తండ్రి కలసి వుండడం శ్రేయస్కరం. బయటకు వెళ్ళినప్పుడు పిల్లలను తమ దగ్గరే వుంచుకోవాలితప్ప వారు ముందుగా వెళ్ళి పోతుంటే వెనుకనుండి హెచ్చరిస్తూ కేకలు వేయడం ఉచితంకాదు. దీని వలన పిల్లలు అనవసరమైన అభద్రతకు లోనవుతారు.

స్నేహభావన నెలకొనాలి

చిన్నపిల్లలు కథలంటే అమితంగా ఇష్టపడతారు. మీరు రకరకాల కథల్ని అప్పటి కప్పుడు చెప్పడం కాదు. పిల్లల పుస్తకాలలోని కథల్ని వారికి బిగ్గరగా చదివి వినిపించండి. ఫలితంగా చదవడంపట్ల వారిలో అమితాసక్తి నెలకొంటుంది. వారు ఈ సందర్భంలో వేసే ప్రశ్నలకు విసుక్కోకుండా, ఓపికగా సమాధానాలు చెప్పండి. వాళ్ళు అడిగితే మరోసారి విన్పించడానికి సంసిద్ధం కండి. చిన్నపిల్లలతో కలసి ఆటలాడు కోవడం మీకెంతో సంతోష దాయకంగా వుండడమే కాదు. మీకు పిల్లలకు మధ్య స్నేహభావన నెలకొనడానికి ఇది తోడ్పడుతుంది. మీరు పిల్లలు కలసి ఒకేలా వినోదించగల ఆటవస్తువులనే మీరు ఎంచు కోవాలి. బ్యాటరీ సాయంతో తిరిగే రైలును కొనుక్కువచ్చి దానితో మీరు ఆడుకొంటూ పిల్లలను దూరంగా కూర్చోపెడుతుంటే వాళ్ళు అవమానానికి లోనయినట్లు భావించుతారు. వారికి ఈ ఆటలలో మీరు సహకారాన్ని అందివ్వాలి. వారి సహకారాన్ని గైకొనాలి. ప్లాస్టిక్ ముక్కలతో మేడ కట్టడాన్ని పిల్లలకు అలవాటు చేయండి. పిల్లలు పొరపాటుచేస్తూ, తిరిగి సరిచేసుకోవడాన్ని మీరు ఆసక్తితో గమనించండి. అంతేతప్ప ఆ ప్లాస్టిక్ భాగాలతో ఇల్లుకడుతూ పిల్లలను చూస్తూ కూర్చోమనడం భావ్యం కాదు. అలాగే పిల్లల స్థాయికి మించిన పనులు చేయమనడం కూడా తప్పే. తనకంటే పెద్దవయస్సు వారితో కలసి పనిచేయడానికి, వారితో సహకరించడానికి పిల్లలెంతగానో గర్విస్తారు. పిల్లల ఊహాశక్తి అపరిమితంగా వుంటుంది. కొంతసేపు ఆడుకొన్న తరువాత వారు తమ ఉత్సాహాన్ని కోల్పోతారు. అప్పుడు వారికి సరైన సూచనలు, ప్రోత్సాహం కల్పించితే తిరిగి తమ ఉత్సాహాన్ని పుంజుకో కల్గుతారు.

పిల్లలు చెప్పేవి శ్రద్ధగా వినండి

అలాగే చిన్నపిల్లలతో సంభాషించడం సైతం ఎంతో ఆసక్తిదాయకంగా వుంటుంది. కాని మీరు సంభాషించే సమయంలో ఎదుట వున్నది చిన్నపిల్లలన్న సంగతి మరచిపొండి. పెద్ద వారితో ఎలా మాట్లాడతారో అలాగే మాట్లాడండి. వారు చెప్పే విషయాన్ని త్రోసిపుచ్చడం కాదు. శ్రద్ధగా సానుభూతితో వినండి. వారి అభిప్రాయాల్ని అవగతం చేసుకోవడానికి యత్నించండి. ముందుగానే వారిని సంజాయిషి అడిగే ధోరణిలో ప్రశ్నించవద్దు. మీకు కావలసిన సమాచారాన్ని తరువాత తెలుసుకోవచ్చు. అలాగే పిల్లలు మాట్లాడే సమయంలో వారిని విమర్శించడానికి యత్నించవద్దు. మీ రెంతగానో విసిగిపోయినా ఆ విసుగుదలను పైకి కన్పించనీయవద్దు. లేదా మీకు విసుగ్గా వుందని, ఏకాంతంగా వుండగోరుతున్నామని పిల్లలతో చెప్పండి.

ఈ ప్రపంచంలోకి కొన్నిగంటల క్రితమే అడుగిడిన చిన్నారిపాప కూడా త్వరలోనే చుట్టూ వున్నవారిని అనుకరించే శక్తిని సంతరించుకొంటుంది. అతి చిన్నవయస్సులోనే

ఎవరూ ఊహించనంతటి వేగంగా పసిపాప చుట్టూ వున్న పరిసరాల నుండి అనేక విషయాలు గ్రహించడానికి ప్రయత్నిస్తుంది.

పసితనంలోనే అనేక విషయాలు గ్రహించగలరు

పాపకు స్కూల్‌కు వేళ్ళే వయస్సు వచ్చాక వివిధ విషయాలు నేర్పవచ్చునుకోవడం పొరపాటని ఆధునిక మనోవైజ్ఞానికులు తెలియజేస్తున్నారు. వివిధ విషయాలు నేర్పేవిధానం, వాటిసాయంతో తమ పరిసరాలను అవగతం చేసుకొంటూ, తామెలా ప్రవర్తించాలో అలవరచుకొనే దృక్పథం పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. ఆరేళ్ళలోపు పిల్లలు అక్షరాలు చదవలేరనుకోవడం పొరపాటు. 18 నెలల వయస్సుకే వారు అక్షరాలను గుర్తుపట్టి చదవగల శక్తిని సంతరించు కొంటారు.

నాలుగేళ్ళ వయస్సుకే సగం మేధాశక్తి

నాలుగేళ్ళ వయస్సుకే మనందరం మేధాశక్తిలో సగభాగాన్ని సంతరించుకో కల్గుతాము. సంవత్సరం వయస్సులో పిల్లలకు ఏం చేప్పాలో, ఎలా చెప్పాలో తల్లి తండ్రులు అర్థం కాకపోవచ్చు. పిల్లలతో వివిధ విషయాలను ఒకటికి పదిసార్లు చెప్పాలి. వారిని తమ ఒడిలో కూర్చోబెట్టుకొని చెట్లు, పక్షులు బొమ్మలను చూపించుతూ వాటి పేర్లు వివరించి చెప్పాలి. మీరు చెబుతున్నది వారికి అర్థం కావటంలేదేమో ననుకొంటూ మీరు ఏం చెప్పినా ఫరవాలేదనుకోవద్దు. మీరు చెప్పుతున్న విషయాలను పిల్లలు అతి సునిశితంగా, సున్నితంగా వింటారు.

తల్లిపై పిల్లలకున్న ప్రేమను వివిధ అంశాలు నేర్పడానికి వినియోగించుకోవాలి

అంతేకాదు. పసిపిల్లలు తల్లి కంఠస్వరాన్ని వినడానికి ఎంతగానో ఇష్టపడతారు. అందుకే చిన్నపిల్లలను లాలించడం, వారిపట్ల మీకున్న ప్రేమను మాట్లల్లో వ్యక్తం చేయడం కూడా ఎంతో ప్రధానం. మీరు అత్యధిక ఆసక్తి చూపిస్తున్నారని గుర్తించినప్పుడు పసిపాప మీరు చెప్పేవి వినడానికి, అర్థం గ్రహించడానికి ఎంతో శ్రద్ధను కనపరచుతుంది. చిన్నపిల్లలు వివిధ విషయాలు నేర్చుకోవడానికి ఎంతో ఉత్సాహపడతారు. కాని మీరు వారికవి సవ్యమైన రీతితో నేర్పకల్గాలి. స్కూలలో జేర్పించకముందే పిల్లలెలా చదవబోతారన్నది నిర్ణయమై పోతుందని గాడ్విన్ అనే శాస్త్రవేత్త పేర్కొంటున్నాడు. అందుకే పిల్లలతో తల్లికి వున్న ప్రేమానుబంధాన్ని వివిధ విషయాలు నేర్పడానికి, పిల్లలకు చదువుపై ఆసక్తి కల్గించడానికి అనుగుణంగా మలచుకోవాలి. తాము ఎత్తుకొని ముద్దాడే సమయంలోనే వివిధ విషయాలు తెలియజేయడానికి యత్నించాలి.

చిన్న పిల్లలు పదిహేను నెలల వయస్సుకే పుస్తకాలలోని అక్షరాలను, బొమ్మలను విడివిడిగా గుర్తించకల్గుతారు. ఆ బొమ్మలను గుర్తించే సమయంలో తల్లి ఉచ్ఛరిస్తున్న మాటలను వారెంతో ఆసక్తితో గ్రహించుతారు. అందుకే పిల్లలు బొమ్మలపట్లగాని ఆటవస్తువులపట్ల గాని ఆసక్తి కనపరచుతుంటే ఆ ఆసక్తి వివిధ విషయాలు తెలుసుకోవడానికి అనుగుణంగా మలచుకోవాలి.

సంవత్సరంలోపే వ్యక్తుల్ని గుర్తిస్తారు

చాలమంది పిల్లలు రెండు సంవత్సరాల లోపే మాట్లాడ గలుగుతారు. మాట్లాడటం రాకముందు వాళ్ళు తమ ఇంటిలోని వ్యక్తులు మాట్లాడే మాటలను, వారు ఉచ్ఛరించే శబ్దాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. సంవత్సరంలోపే వ్యక్తుల్ని, వస్తువుల్ని వారు గుర్తించకల్గుతారు. తరువాత పాలు త్రాగమన్నా, చొక్కా తొడుక్కోమన్నా, బొమ్మలతో ఆడుకోమన్నా వారు అర్థం చేసుకోకల్గుతారు. తాము రోజూ చూసే వివిధ వస్తువుల పేర్లు తెలుసుకోకల్గుతారు. తరువాత చిన్న, చిన్న మాటలను కూడా అర్థం చేసుకొంటారు. 'ముద్దు పెట్టమ్మా' 'టాటా చెప్పు ' అని చెబితే అర్థం చేసుకొని అలా చేయకల్గుతారు.

చిన్న పిల్లలు ఏడుస్తూ, నవ్వుతూ కొన్ని శబ్దాలను సృష్టిస్తారు. తరువాత నెమ్మదిగా ఏవేవో శబ్దాలు చేస్తారు. ఆయా శబ్దాలు వారికే ఎంతో విచిత్రకరంగా అన్పిస్తాయి కాని ఆరునెలలు వచ్చాక కొంత స్పష్టంగా శబ్దాలు చేయకల్గుతారు. పరిసరాలను, ఇతర వ్యక్తులను ఎంతో ఆసక్తిగా గమనిస్తారు. పదేపదే వినే మాటలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. చిన్నపిల్లలు ఏ భాషనైనా అతి త్వరగానే నేర్చుకోకల్గుతారు. వాళ్ళు సంస్కృత భాషకుగాని, లాటిన్ భాషకుగానీ, జపాన్ భాషకుగాని చెందిన శబ్దాలను సైతం ఉచ్ఛరించగలరు. కాని రోజూ తమ చుట్టూ వున్న వ్యక్తులు మాట్లాడే పదాలను ఉచ్ఛరించే శైలికి క్రమంగా అలవాటు పడిపోతారు. తాము నేర్చుకొన్న భాషను మాత్రమే మాట్లాడకల్గుతూ క్రమేణా ఏ భాషనైనా సులభంగా ఉచ్ఛరించగల శక్తి కోల్పోతారు.

శబ్దాలను ఉచ్ఛరించడం పిల్లలకో విచిత్రానుభూతి

చిన్నారి పాప వున్నట్లుండి 'అమ్మా' అని పిలుస్తుంది. తల్లి ఈ పిలుపు విని ముగ్ధురాలై పారవశ్యంతో ఆ పాపను ముద్దాడుతుంది. 'అమ్మా' అని 'నాన్నా' అని పాప అనగానే చుట్టూ వున్న వారంతా సంతోషాతిరేకంతో ఎంతో మెచ్చుకోలును ప్రదర్శిస్తారు. అందమైన, తనకు అమిత ఇష్టమైన బొమ్మలతో ఆడుకొన్నప్పుడు, మంచంపై బొమ్మలతో పడుకొన్నప్పుడు, మంచంపై అటూ ఇటూ దొర్లినప్పుడు, తల్లి ఒడిలో మారాం చేసి నప్పుడు కలిగే విచిత్రానుభూతి, పాపకు ఈ శబ్దాలను ఉచ్ఛరించేటప్పుడు కల్గుతుంది. రకరకాల శబ్దాలను మిళితం చేసి ఇలా పదాలనుచ్ఛరించడం పాపకు ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది.

ముందు ఉచ్ఛారణ, తరువాత వాటి అర్థం

తల్లి రకరకాల పదాలను నేర్పడానికి ప్రయత్నిస్తుంది. పాప క్రమేణా ఆయా పదాలనుచ్ఛరిస్తుంది. ప్రతి పదమూ ఆ పాపకెంతో విచిత్రంగా వుంటుంది. వాటి నుచ్ఛరించడం పాపకెంతో తమాషాగా అనిపిస్తుంది. ముందుగా వివిధ పదాలను ఉచ్ఛరిం చడం నేర్చుకొన్న పాపకు ఆ పదాలసలు ఏం సూచిస్తాయో నేర్చుకోవడానికి చాల సమయం పడుతుంది. తన తల్లిని 'అమ్మ' అని పిలవడాన్ని నేర్చుకొన్న పాప తన తల్లి వయస్సులో వున్నవారందరినీ 'అమ్మా' అనే పిలుస్తుంది. అమ్మ అనే పదానికి పాపకు అర్థం తెలియదు. అలాగే 'పాలు' అని ఉచ్ఛరించకల్గిన పాప మంచినీళ్ళను కూడా 'పాలు' అంటుంది.

తల్లిలాగా మాట్లాడడం నేర్చుకొంటారు

ముందుగా చిన్న పిల్లలురకరకాల వస్తువుల పేర్లను నేర్చుకో కల్గుతారు. పలక,బలపం, పుస్తకాలు గుర్తించకల్గి వాటి పేర్లు చెప్పకల్గిన పాపలు రకరకాల చేష్టలను గుర్తించే పదాలను అర్థం చేసుకోలేరు. వ్రాయడం నేర్చుకొంటున్నప్పుడు మాత్రమే వివిధ చేష్టలను సూచించే పదాలను అర్థం చేసుకోకల్గుతారు.

చిన్న పిల్లలు ఉచ్ఛారణ నేర్చుకోవడంపై తల్లి ప్రభావం అమితంగా వుంటుంది. నేర్చుకొనే వయస్సులో ఆ మాట్లాడే తీరు ఎలా అలవర్చుకొంటే పెద్దయ్యాక సైతం అదే తీరులో వుంటుంది. తల్లి వేగంగా మాట్లాడుతుంటే చిన్న పిల్లలు అలాగే మాట్లాడడాన్ని అలవాటు చేసుకొంటారు. పెద్దయ్యాక కూడా వారలానే మాట్లాడుతుంటారు. మిగతా అందరిలా తాపీగా మాట్లాడడం వారికెంతో క్లిష్టంగా పరిణమిస్తుంది.

త్వరగా మాటలు నేర్చుకొన్న పిల్లలు చురుకుతనం ప్రదర్శిస్తారు

పిల్లలు ఏవో కొన్ని ముఖ్యమైన పదాలనుచ్ఛరించగానే తల్లులు ఇక వివిధ పదాలను నేర్పడానికి శ్రద్ధతీసుకోరు. ఆ పిల్లలే తోటివారి దగ్గరనుండి అవీ ఇవీ నేర్చుకువచ్చి అసందర్భంగా మాట్లాడుతుంటారు. అదివిని తల్లి వారిని కోపంతో దండించబోతే పదాలను నేర్చుకోలేక పోవడం, స్కూలుకు వెళితే అక్కడ ఉపాధ్యాయుడు చెప్పే వివిధ విషయాలు వారికి అనాసక్తిగా వుండడం జరుగుతుంది. చిన్న పిల్లలు త్వరగా మాట్లాడడం నేర్చుకొంటే వారు త్వరగా ఆలోచించుకోగల్గి, చురుకుదనాన్ని ప్రదర్శిస్తారు.

నిర్బంధశిక్షణను నిర్దేశించడం వలన చిన్న పిల్లల్లో ఆందోళనకరమైన పరిణామాలు వ్యక్తమవుతాయి. వారు ఊరకనే భయ భ్రాంతులు కావడం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం, క్రోధాన్ని, అపరాధ భావనలను మదిలో నింపు కోవడం జరుగుతుంది.

పిల్లల్ని పెంచే సమయంలో తల్లితండ్రులు వారితో ఎలా ప్రవర్తించాలి?

భారతదేశంలో తండ్రులు తమ పిల్లలకు కఠినమైన క్రమ శిక్షణను నిర్దేశించి అనేక కట్టుబాట్లను ఆదేశిస్తారు. లేదా అతి గారా

బాన్ని కనబరచుతూ వారికి పూర్తిగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనిస్తారు. వారి సంగతి పట్టించుకోరు. ఈ రెండు రకాల ప్రవర్తనలుకూడా పిల్లల మనోవికాసానికి ఏ మాత్రం దోహదం చేయవని మనోవైజ్ఞానికులు పేర్కొంటున్నారు.

నిర్బంధ శిక్షణ నేర్పే తల్లితండ్రులు అసమర్థులు

కఠినమైన నియమావళిని నిర్దేశించే తల్లితండ్రులు ఇతరులతో చాల అణకువగా వుంటారని, నిర్ణయాలు గైకొనలేరని, అసమర్థత, అవిశ్వాసం వారిలో గూడుకట్టుకు వుంటాయని పరిశోధనల వలన వెల్లడైంది. ఈ లక్షణాలనుకనబరచే తల్లితండ్రులే కఠిన క్రమశిక్షణలో పిల్లల్ని పెంచబోతారు. ఇలా నిర్బంధశిక్షణను నిర్దేశించడం వలన చిన్న పిల్లల్లో ఆందోళనకరమైన పరిణామాలు వ్యక్తమవుతాయి. వారు ఊరకనే భయ భ్రాంతులు కావడం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం, క్రోధాన్ని, అపరాధ భావనలను మదిలో నింపుకోవడం జరుగుతుంది. తిరిగి వీరు పెద్దవారైన తరువాత తమ పిల్లలతో సక్రమ సంబంధాలు నెలకొల్పుకోవడంలో విఫలం కావడం కూడ సంభవిస్తుంది.

విచ్చలవిడితనం పిల్లల మనస్థితి దెబ్బతీస్తుంది

అలాగే విచ్చలవిడి ప్రవర్తనను ఆమోదించినా అది పిల్లల మనస్థితిని దెబ్బతీస్తుంది. ఇటువంటి ప్రవర్తనకు అలవాటుపడిన పిల్లలలో తీవ్రమైన అహంకారం నెలకొంటుంది. అలాగే వారు అతి తేలిగ్గా నిస్పృహకు లోనవుతుంటారు. అసహనాన్ని వ్యక్తం చేస్తారు. జీవితంలో ఓ నియామావళికి కట్టుబడతారు. ఇచ్చ వచ్చినట్లు ప్రవర్తించబోతారు. అందుకే తెలివైన తల్లితండ్రులు కఠినమైన క్రమశిక్షణను నిర్దేశించరు. అలాగే పిల్లల్ని వారిమానానికి వారిని వదిలివేయరు. వివిధ సందర్భాలలో సహాయ సహకారాల నందిస్తూ భద్రతాభావన కలిగించడానికి తోడ్పడతారు.

చిన్నతనంలోనే ఎక్కువగా పట్టించుకోవాలి

చాలమంది తల్లితండ్రులు తమ పిల్లలకు హైస్కూలుకు వెళ్ళే వయస్సు వచ్చే వరకూ వారి ప్రవర్తనను పెద్దగా పట్టించుకోనవసరం లేదనుకొంటారు. తామెలా వ్యవహరించినా ఫరవాలేదనుకొంటారు. కాని పిల్లలు నడక నేర్చుకొన్నప్పటినుండి వారి మనోవికాసానికి అనుగుణంగా తమ ప్రవర్తనను తీర్చిదిద్దుకోవాలి. చిన్నపిల్లలు ఏం చెప్పబోతున్నా శ్రద్ధగా, ఆసక్తితో వినాలి. వారు వేసే ప్రశ్నలన్నింటికీ స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. వారితో ప్రతిరోజూ కొంతకాలాన్ని గడపాలి.

పిల్లలు తమ తల్లితండ్రులను ఆదర్శంగా గైకొంటుంటారు. అంతేకాదు, వారి తల్లితండ్రుల్ని అతి సునిశితంగా పరిశీలించుతుంటారు. అందుకే పిల్లల దగ్గరవున్నప్పుడు మీ పనులు మానుకోవడం మంచిదికాదు. మీరు ఓ పత్రికను గాని, పుస్తకాన్ని గాని ఏకాగ్రతతో చదువుతుంటే ప్లిలలుసైతం అతి త్వరలోనే వాటిని చూడడానికి, లేదా చదవడానికి ఉత్సాహాన్ని కనబరచుతారు. అలాగే మీరు ఖచ్చితంగా రాత్రి ఎనిమిది గంటలకు భోజనానికి కూర్చోమంటే పిల్లలకు కూడా క్రమంగా అది అలవాటవుతుంది. మీరొక రోజున ఏడు గంటలకే, భోంచేస్తుంటే పిల్లలు సైతం మిమ్మల్ని అనుకరించడానికి ప్రయత్నిస్తారు.